JANUARY, 2025 : VOLUME 23 : ISSUE 47

# LAKSHYA

Annual House Bulletin of the Society




**SOCIETY FOR EDUCATION OF THE DEAF & BLIND (REGD.)**
**2-2-20, Perlavari Street, VIZIANAGARAM - 535 001.**
**Mobile : 9392770832**
**e-mail : sedbvzm@gmail.com** **www.sedbvzm.org**

# PHOTO CLIPPINGS



శ్రీ అశోక్ గజపతిరాజు గారిచే మానసిక దివ్యాంగుల
మనోవికాస ప్రాంగణ ప్రారంభోత్సవం




పాఠశాల అభివృద్ధికై మెసానిక్ టెంపుల్ వారిచే
సంస్థ యాజమాన్యానికి చెక్కు అందచేత



పాఠశాలలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలు




“మానవసేవ” వారికి కృతజ్ఞతలు తెలుపుతున్న
విద్యార్థులు



మన పాఠశాలలో జరుపుకున్న
“ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు”



పాఠశాలకు విరాళము అందజేస్తున్న మన సంస్థ
వైస్ ప్రెసిడెంట్ శ్రీ వెంకటేశ్వర రావు గారు

# LIST OF BOARD OF MANAGEMENT


| | | |
|---|---|---|
| Chief Patron | Sri Perla Rama Krishna<br>Retd. Manager, S.B.I | 8019742611 |
| Hon. Founder Secretary | Sri Y. Vishnu<br>Retd. Head of the Dep. of Commerce | 8374478824 |

**EXECUTIVE MEMBERS :**

| | | | |
|---|---|---|---|
| 1. | Hon. President | Sri T. Appa Rao<br>(Retd.) (DPRO) | 9490085573 |
| 2. | Hon. Vice President | Sri T. Venkateswara Rao<br>Rtd. Agricultural Scientist | 9704799063 |
| 3. | Hon. Secretary | Sri K.R.D.Prasada Rao<br>(Rtd R.D.O) | 9441873677 |
| 4. | Hon. Joint Secretary | Sri Perla Raja Gopal<br>Business | 9440365352 |
| 5. | Hon. Treasurer | Sri B. Chakravarthi<br>Senior Journalist | 9346194406 |

**HON. MEMBERS :**

| | | |
|---|---|---|
| 6. | Sri G.Prabhakar<br>Rtd. S.B.I. Officer | 9440193339 |
| 7. | Sri A. Sivaramakrishna<br>Retd. Zonal Manager, Agro Chemicals | 9440345180 |
| 8. | Sri R.V.V. Subba Rao<br>Rtd. J.E, BSNL | 8639027531 |
| 9. | Sri Perla Srinivasa Rao<br>Retd. Accounts Officer,<br>Mylan Company Ltd. | 9491538642 |
| 10. | Sri S. Ramprasada Rao<br>Retd. Teacher | 9989370195 |
| 11 . | Sri B.V.S. Kamaraju<br>Retd. Assistant Treasury Officer | 9346852043 |
| 12. | Sri T. Appa Rao<br>Retd. C.I. of Police | 9989623221 |
| 13. | Sri D. Sukumar<br>Business | 9032217517 |
| 14. | Sri T. Jagannadha Raju<br>Retd. Manager, APGVB | 9440334589 |

**HON. ADVISORY MEMBERS :**

| | | |
|---|---|---|
| 1. | Sri. B. Bhaskara Rao<br>Business | 9848145132 |
| 2. | Smt. K. Lalitha Kumari<br>Retd. Principal | 9160424256 |
| 3. | Sri Dwivedula Sastry<br>Boston, (U.S.A) | |
| 4. | Sri V. Badrinath<br>Boston, (U.S.A) | |
| 5. | Sri P.S.V. Kumar<br>Retd.SBI Officer | 9440753461 |
| 6. | Smt. Karri Uma Devi<br>Speech Therapist | |


## INDEX

**Content** **Page**


| Content | Page |
|---|---|
| సంపాదకీయం | 2-3 |
| మానసిక వికలాంగ పిల్లలు పెన్షన్ పొందేందుకు అర్హులు | 04 |
| మానసిక వైకల్యం వున్న పిల్లలకు పేరెంట్సే థెరపిస్టులు | 05-06 |
| మానసిక రుగ్మత | 06-07 |
| వృద్ధాప్యానికి ఆహ్వానం | 07-10 |
| మంచిమాట | 10 |
| మానసిక రుగ్మతను కలుగజేసేదేమిటి? | 11 |
| యుగపురుషుడు రామకృష్ణ పరమహంస | 12 |
| అభిప్రాయం: వికలాంగులకు కావలసింది ఏంటి? | 13-16 |
| Disability Symbols | 17 |
| Gratitudes | 18 |
| Events & Achievements of S.M.R.P.R.C. School for the Deaf & VIKAS School for the M.R. (Intellectually Disabled) | 19-20 |

# సంపాదకీయం



## తెలుగు రాష్ట్రాలలో రోజురోజుకి దిగజారిపోతున్న రాజకీయ సంస్కృతి

మనం ప్రజాస్వామ్య దేశంలో వున్నాం. ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టానానికి అనుగుణంగా ప్రభుత్వాలు ఏర్పడుతూ వుంటాయి. ఒకసారి వచ్చిన ప్రభుత్వం మరోసారి రావాలన్న నిబంధన లేదు. ప్రజాస్వామ్యంలో మార్పులు సహజం. ఎవరైనా స్వాగతించవలసినదే. కానీ, దురదృష్టవశాత్తు మన తెలుగు రాష్ట్రాలలో విభజన తరువాత ఇలాంటి పరిస్థితులు లేవనే చెప్పాలి. రాష్ట్రం ఉమ్మడిగా వున్నప్పుడు ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ రాజకీయ పరిస్థితులు సుస్థిరంగానే వుండేవి. ఎప్పుడు ఏ పార్టీ అవతరించినా, అన్ని వర్గాల వారు ప్రజాస్వామ్య విలువలను కాపాడే పరిస్థితి వుండేది. కానీ, రాష్ట్ర విభజన తరువాత తొలిసారిగా కొత్త రాష్ట్రాలలో కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాక, రెండు రాష్ట్రాలలోనూ విపక్షాలలో అశాంతి నెలకొని వుండడం బాధాకరం. తెలంగాణా కంటే ఆంధ్ర రాష్ట్రంలో ఈ జాడ్యం రోజురోజుకీ ఎక్కువైపోతోందనే చెప్పాలి. కొత్తగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రంలో రెండు ముఖ్యమైన పార్టీల మధ్య ఘర్షణలు ఏర్పడడం గమనార్హం. ప్రజలు నాడు తెలుగుదేశానికి పట్టం కట్టి వై.ఎస్.ఆర్ పార్టీకి విపక్ష హోదానిచ్చారు. కొత్త రాష్ట్రంలో అనేక సవాళ్ళను ఎదుర్కొనవలసిన పరిస్థితులు ప్రభుత్వానికి వుంది. రాష్ట్రానికి రాజధాని లేదు. ఆర్థిక వనరులు లేవు. దానికి తోడు లోటు బడ్జెట్ వున్న రాష్ట్రం. రాష్ట్ర విభజన కూడ సశాస్త్రీయమైన పరిస్థితులలో జరగలేదనే చెప్పాలి.

పదేళ్ళ వ్యవధి వున్నప్పటికీ కొత్త రాజధాని నిర్మాణానికి నాంది పలకవలసిన అవసరం వుంది. ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా అంతగా కనిపించలేదు. అటువంటి పరిస్థితులలో నవరాష్ట్ర నిర్మాణానికి రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా అందరూ కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. కానీ జరిగిందేమిటి? కొత్త ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ముఖ్యోద్దేశంగా ముఖ్య ప్రతిపక్షమైన వై.ఎస్.ఆర్. పార్టీ చేయని అకృత్యమంటూ లేదు. ప్రజా శ్రేయస్సుని దృష్టిలో వుంచుకుని ప్రభుత్వ విధానాలను విమర్శించే అధికారం విపక్షాలకు ఎప్పుడూ వుంటుంది కానీ, ప్రజాస్వామ్యంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని బలహీనపరిచే లేదా పడగొట్టేందుకు మాత్రమే అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం ఎంతమేరకు సమంజసం? ప్రభుత్వానికి అవసరమైన సలహాలు అందించడం మాని, ప్రతీ విషయాన్ని కోర్టులకు తీసుకుపోయి కాలయాపన చేసే యత్నాలు రాజకీయ నీచత్వానికి పరాకాష్ఠ. నాటి ప్రభుత్వం కొత్త రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుండి రుణం పొందడానికి ప్రయత్నిస్తే, వారికే నేరుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనికిరాని ఫిర్యాదులు చేయడాన్ని ఏమనుకోవాలి? ప్రధాన ప్రతిపక్షం రాష్ట్ర అసెంబ్లీలో తమ ఉద్దేశ్యాలను ధైర్యంగా చెప్పొచ్చు. కానీ, కుటిల రాజకీయాలతో అయినదానికీ, కానిదానికీ అడ్డుకట్ట వేయవలసిన అవసరం లేదు. కొత్త రాష్ట్రాన్ని ఒక కొలిక్కి తేవడం అంత సులువైన పని కాదు. కొత్త కార్యాలయాలను, సంస్థలను నెలకొల్పవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా, అంత వరకు ఉమ్మడి రాష్ట్రంలో పని చేస్తూ, కొత్త రాష్ట్రానికి వేలాదిమంది ఉద్యోగస్తులను సాదరంగా ఒప్పించి తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుంది.

అప్పటి ప్రభుత్వం ఈ విషయంలో ఎంత చొరవ చూపించిందో మనకందరికీ తెలిసిన విషయమే. అమరావతిని కొత్త రాజధానిగా అసెంబ్లీలో ప్రకటించినప్పుడు, ఈ ప్రతిపాదన ఇష్టం లేకపోతే, ప్రధాన విపక్షమైన వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అడ్డుచెప్పి వుంటే, అమరావతి రైతులు తమ భూములను ఉచితంగా ఇచ్చేవారు కారేమో. కానీ, ఆనాటి రైతుల త్యాగం ప్రపంచానికే తలమానికం అని చెప్పొచ్చు.

ఇకపోతే, 2019 ఎన్నికలలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర ప్రభావమో, లేదా నవరత్నాల ప్రలోభమో, అసంపూర్ణ రాజధాని నిర్మాణాన్ని పాత ప్రభుత్వమే పూర్తి చేయగలదన్న భావనే లేకుండా విపక్షమైన వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకు ప్రజలు తిరుగులేని మెజార్టీతో పట్టం కట్టడం రాష్ట్ర చరిత్రలో మరువరాని విషయం. కలిసి వచ్చిన అదృష్టమనుకుని ప్రజలు ఇచ్చిన అపూర్వ అవకాశాన్ని కాలదన్ని, కక్షలతో ప్రతీకార చర్యలకు పూనుకుని, పోలీసు వ్యవస్థను చేతిలో పెట్టుకుని రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేయడం నిజంగా దురదృష్టకరం.

కానీ, కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలలు కాకముందే ఓటమిని జీర్ణించుకోలేని విపక్షం ప్రతీ విషయంలోనూ బురద జల్లే కార్యక్రమాలు మొదలుపెట్టి, రాష్ట్రపతి పాలన కోసం గలాటా చేయడం చాలా హాస్యాస్పదం. సార్వత్రిక ఎన్నికలకు చాలా సమయం వున్నప్పటికీ, అధికారానికి ఇప్పటి నుంచీ అర్రులు జాచడం మరీ విడ్డూరంగా వుంది. అంటే, ప్రజాసేవ అనే ముసుగులో రాజకీయ నాయకులు అధికారం చేపట్టడానికి అహంకార మదంతో ఎంత దిగజారిపోతున్నారో అర్థం అవుతోంది. అంతే కాకుండా విపక్షంలో ఓడిపోయిన అభ్యర్థులు స్వప్రయోజనాల కోసం అధికార పక్షంలోకి గెంతులేసి రావడం రాజకీయ సంప్రదాయాలకు విరుద్ధమైనప్పటికీ, గతంలో వారు చేసిన అరాచకాలను మర్చిపోయి, తమ పార్టీలలోకి ఆహ్వానించడం కూడా అవాంఛనీయమనే చెప్పాలి.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అయిదు నెలల సమయంలో చంద్రబాబుగారి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చే దిశలో తమ రాజధాని అమరావతిని, పోలవరం, పరిశ్రమలు మొదలైన వాటి మీద శ్రద్ధ చూపించడం అవసరం. కానీ, గత ప్రభుత్వ పాలనలో అరాచకాలకు కారకులైన అధికారులు, రాజకీయ నాయకుల మీద కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు కనిపిస్తున్నాయి. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి గారు కక్ష సాధింపు చర్యలకు, ప్రతీకారాలకు గానీ, వైషమ్యాలకు గానీ తావు ఇవ్వనని, సాధ్యమైనంత వరకు చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని బాహాటంగానే చెప్పడం నిజంగానే సంతోషకరమైన విషయంగానే చెప్పుకోవాలి. ఎందుకంటే, ప్రస్తుత ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ తరహాలో నీచకృత్యాలకు పాల్పడితే, తదుపరి ఎన్నికల తరువాత ఏర్పడే ప్రభుత్వాలు అదే దారిలో నడవడం ఖాయం. ఇది ఒక విషవలయంగా తయారవుతుంది. అయినప్పటికీ సామాజిక మాధ్యమాలలో వస్తున్న విమర్శలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని విషయాలలో న్యాయపరంగా చట్టబద్ధపరమైన సత్వర చర్యలు చేపట్టినప్పటికీ, కోర్టుల ఆదేశాల మేరకో లేదా పోలీసు వ్యవస్థలోని అలసత్వం వలనో ఎందులోనూ చెప్పుకోదగిన పురోగతి కనిపించక పోవడం శోచనీయం.

అంతేకాక ఏ మహానుభావుడి సలహాలో తెలియదు గాని అడిగిన అన్ని ప్రశ్నలకు అంత మంది ముద్దాయిలూ ఒకే రకంగా "**తెలియదు**", "**మరచిపోయాను**", "**గుర్తు లేదు**" అనే సమాధానాలు ఇవ్వడం పరిపాటి అయిపోయింది. దీనికి తోడు కోర్టులు కూడా ముద్దాయిల విషయంలో తొందరపాటు చర్యలు వద్దని ఉత్తరువులు ఇస్తుండడం గమనార్హం. ఇప్పటికే, మన తెలుగు రాష్ట్రాలలో రాజకీయాల సంస్కృతి బాగా దిగజారిపోయి, భ్రష్టు పట్టిపోతున్నదని చెప్పాలి. ఈ పరిస్థితి కొనసాగితే, రాష్ట్రాల పురోగతి అధోగతే. తెలంగాణా రాష్ట్రంలో కూడా ఇవే పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ, మన దేశంలోని ఇతర రాష్ట్రాలలో ఇంతగా రాజకీయాలు దిగజారిపోయిన దాఖలాలు కనపడలేదు. విభిన్న పార్టీలతో ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి గానీ, ఒకరి మీద ఒకరు బురద జల్లుకునే ప్రయత్నాలు అంతగా కనపడడం లేదనే చెప్పాలి.

ఏది ఏమైనప్పటికీ, రాష్ట్ర ప్రగతిని, ప్రజల శ్రేయస్సుని దృష్టిలో వుంచుకుని మన తెలుగు రాష్ట్రాలలో రాజకీయ పార్టీలు మెలగవలసిన అవసరం ఎంతైనా వుంది. ప్రజాధనంతో కోట్లు వెచ్చించి అన్నింటి మీద రంగులు మార్పు చేయడం వల్ల గానీ, ఉచితాలతో గానీ, ఇతర ప్రచార సాధనాలతో గానీ సర్వాంతర్యామిగా ఉండాలని సర్వత్రా ప్రజల గుండెల్లో ఉండగలమన్నది కేవలం భ్రాంతి అని తేలిపోయింది. దిగజారుడు రాజకీయాలే చేయాలనుకుంటే ఏ పార్టీకైనా సరియైన పాఠం చెప్పి, ఆంధ్ర రాష్ట్రానికి ఉపశమనం కల్పించలేనంత అసమర్థులు, అమాయకులు మన ప్రజలు కారని ఆశిద్దాం.

గౌరవ వ్యవస్థాపక కార్యదర్శి

## మానసిక వికలాంగ పిల్లలు కుటుంబ పెన్షన్ పొందేందుకు అర్హులు: డాక్టర్ జితేంద్ర సింగ్

మానసిక వైకల్యం కలిగి ఉన్న మరణించిన ప్రభుత్వ ఉద్యోగి / పెన్షనర్ పిల్లలు పెన్షన్ పొందేందుకు అర్హులని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూగర్భ శాస్త్రం, సిబ్బంది వ్యవహారాలు, పెన్షన్లు, ప్రజా ఫిర్యాదులు, అంతరిక్ష, అణుశక్తి శాఖ సహాయ (స్వతంత్ర) మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేసారు. మానవతా దృక్పథంతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని పూర్తిగా, తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన ఈ రోజు స్పష్టం చేసారు.

కొన్ని బ్యాంకులు మానసిక వైకల్యం కలుగి ఉన్న మరిణించిన ప్రభుత్వ ఉద్యోగి / పెన్షనర్ పిల్లలు వారు నామినేట్ చేసిన వ్యక్తులకు కుటుంబ పెన్షన్ చెల్లించేందుకు నిరాకరిస్తున్నాయని పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ దృష్టికి వచ్చింది. దీనిపై తీవ్రంగా స్పందించిన కొన్ని బ్యాంకులు, పెన్షనర్ లేదా అతను / ఆమె నామినేట్ చేసిన వారికి పెన్షన్ ఇవ్వకుండా చట్ట ప్రకారం జారీ చేసిన గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ అందించాలని పట్టుబడుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవన సౌలభ్యం కోసం సుపరిపాలనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం కుటుంబ పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా మానసిక వైకల్యంతో బాధపడుతున్న లేదా తల్లిదండ్రులను కోల్పోయిన మానసిక దివ్యాంగ పిల్లలకు కోర్టు జారీ చేసే గార్డియన్‌షిప్ సర్టిఫికేట్‌తో సంబంధం లేకుండా కుటుంబ పెన్షన్ పొందేందుకు వీలు కల్పించామని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. ఈ నేపథ్యంలో పెన్షన్ పొందేందుకు కోర్టు జారీ చేసిన గార్డియన్‌షిప్ సర్టిఫికేట్ కోసం బ్యాంకులు పట్టుబట్టడం సమంజసం కాదని ఆయన స్పష్టం చేసారు. ఇది సెంట్రల్ సివిల్ సర్వీస్ (పెన్షన్) నిబంధనలు, 2021కు విరుద్ధమని అన్నారు.

ఇది సెంట్రల్ సివిల్ సర్వీస్ (పెన్షన్) నిబంధనలు, 2021కు అనుగుణంగా కుటుంబ పెన్షన్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని పెన్షన్లు పంపిణీ చేస్తున్న అన్ని బ్యాంకుల సీ.ఎం.డీ.లకు మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గార్డియన్‌షిప్ సర్టిఫికేట్ కోసం పట్టుబట్టకుండా మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగి / పెన్షనర్ / కుటుంబ పెన్షనర్ నామినేట్ చేసే వ్యక్తుల ద్వారా పెన్షన్ చెల్లించాలని ఆదేశిస్తూ, సి.పి.పి.సి. / పెన్షన్ చెల్లిస్తున్న శాఖలను ఆదేశించాలని సీ.ఎం.డీ.లకు రాసిన లేఖలో మంత్రిత్వ శాఖ సూచించింది.

పెన్షన్ నిబంధనలలో మార్పులు చేస్తూ, ఇటీవల కాలంలో పెన్షన్ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. విడాకులు పొందిన ఆడపిల్లలకు పెన్షన్ సౌకర్యం కల్పించడం, ఎక్కువ వయసు కలిగిన పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు మొబైల్ యాప్ ద్వారా ఫేస్ రెకగ్నిషన్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడం, ఎలక్ట్రానిక్ పెన్షన్ పే ఆర్డర్, పెన్షన్ పంపిణీలో తపాలా శాఖ సహకారం తీసుకోవడం లాంటి చర్యలను పెన్షన్ల శాఖ తీసుకుంది.

**The only way to achieve the impossible is to believe it is possible**

**To give up yourself without regret is the greatest charity**

**The best way to find yourself is to lose yourself in the service of others**

# మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు పేరెంట్సే థెరపిస్టులు

కరోనా ఈ ప్రపంచాన్నే మార్చేసింది. కోవిడ్ భయం మన లైఫ్ స్టయిల్‌ను మార్చేసింది. ఇంటికే పరిమితమై ఉండే ఈ కొత్త జీవితం కొంత ఒత్తిడిని, ఆందోళనను కలిగిస్తోంది. సాధారణ వ్యక్తులపైనే ఈ ప్రభావం ఇలా వుంటే ఇక స్పెషల్ కిడ్స్ మీద ఇంకా ఎక్కువగా వుంటుందనేది వేరే చెప్పక్కర్లేదు. నేర్చుకునే వయసులో నేర్చుకోకపోతే వాళ్ళు ఇంకెప్పటికీ నేర్చుకోలేరు కూడా. స్పెషల్ లెర్నింగ్ అవసరమైన పిల్లల కోసం ఇప్పుడు పేరెంట్సే థెరపిస్టులు. టెలీ రిహాబిలిటేషన్ సపోర్ట్‌తో థెరపిస్ట్ సలహాలతో వినలేని, మాట్లాడలేని పిల్లలకు ఇంట్లోనే విద్యాబుద్ధులు నేర్పకపోతే ఇంతకు ముందు నేర్చుకున్నది, చదివిందంతా పోతుంది.

చెవిటి, మూగ, మానసిక వైకల్యం వున్న పిల్లలు ప్రతి రోజూ అలవాటుగా చేసే పనులతో ఇబ్బంది పడరు. కానీ, ఎప్పుడైతే దినచర్యలో మార్పు వస్తుందో, రెగ్యులర్ లైఫ్ స్టైల్‌కి బ్రేక్ అవుతుందో, ఆప్పుడు వాళ్ళలో ఆందోళన మొదలవుతుంది. అప్పటి నుంచి బిహేవియర్లో కూడా మార్పు వస్తుంది. అలాంటి పిల్లలు డిఫరెంట్ బిహేవియర్‌తో వున్నారంటే, వాళ్ళు ఆందోళనలో వున్నారని గుర్తించాలి. అప్పటి నుంచి వాళ్ళను ఎక్కువగా కనిపెట్టుకోవాలి.ఇలాంటి సందర్భాల్లో లోపాలు ఉన్న పిల్లలే కాకుండా పేరెంట్స్ కూడా ఆందోళన చెందుతారు.స్పెషల్ కిడ్స్‌కి దీర్ఘకాలం పర్సనల్ టీచింగ్, హియరింగ్ అండ్ స్పీచ్ థెరపీ ఆగిపోతే వాళ్ళ మానసిక ఎదుగుదల ఆగిపోతుంది. ఇది ఫ్యుచర్‌కి మంచిది కాదు.

### ఫ్యూచర్లో కష్టమే

కొన్ని పరిస్థితులలో ఇంట్లోనే ఉండడం వల్ల ఇంతకాలం వాళ్ళు కష్టపడి నేర్చుకున్న స్కిల్స్ అన్నీ మర్చిపోతుంటారు. వాళ్ళకు కావాల్సిన రెగ్యులర్ థెరపీ ఆగిపోతే చదువు, సోషల్ లైఫ్‌లో పూర్తిగా వెనుకబడే ప్రమాదం వుంది. స్పెషల్ కిడ్స్ కోసం ఇప్పుడు శ్రద్ధ తీసుకోకపోతే ఫ్యూచర్లో నేర్చుకోవడంలో వెనుకబడిపోతారు. ఆ తరువాత జీవితకాలం తల్లిదండ్రుల పైనే ఆధారపడి బతకాల్సి వస్తుంది. పేద, మధ్య తరగతి వారికి ఆర్థికంగా మోయలేని భారం కూడా. అందుకే ప్రత్యేక అవసరాలున్న పిల్లల మీద పర్సనల్ కేర్, టీచింగ్ గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి.

### ఆన్‌లైన్‌లో రిహాబిలిటేషన్

ఈ పరిస్థితుల వల్ల విదేశాల్లో ఎక్కువగా ప్రాక్టీస్‌లో వున్న టెలీ రిహాబిలిటేషన్ ఇప్పుడు మన దగ్గర కూడా తప్పనిసరి. పల్లెటూళ్ళలో వుంటూ, పట్టణాలకు రాలేనివారికి, పట్టణాలలో వున్నా, రిహాబిలిటేషన్ సెంటర్‌కు పోలేని పరిస్థితులలో ఉన్నవాళ్ళు కన్సెల్టెన్సీనీ, థెరపీని వాయిదా వేయకుండా టెలీ రిహాబిలిటేషన్ ద్వారా కంటిన్యూ చేస్తేనే వాళ్ళు నేర్చుకున్న విషయాలను మర్చిపోకుండా ఉంటారు. స్కూల్స్ మళ్ళీ ఓపెన్ చేసిన తర్వాత చదువులో వెనుకబడరు.

### పేరెంట్స్ డౌట్స్

'**టెలీ రిహాబిలిటేషన్ పని చేస్తుందా? రిజల్ట్ ఉంటుందా?**' అని పేరెంట్స్‌కి డౌట్ ఉంటుంది. విదేశాల్లో ఇది బాగానే ప్రాక్టీస్‌లో ఉంది. మన దేశంలో ఈ పద్ధతిని ఎక్కువగా ప్రాక్టీస్ చేయకపోవటానికి కారణం టెలీ కనెక్టివిటీ సరిగా లేకపోవడమే. అంతేకానీ, పనిచేయదని కాదు. పర్సనల్ హియరింగ్ అండ్ స్పీచ్ థెరపీతో ఎలాంటి రిజల్ట్ ఉంటుందో, టెలీ రిహాబిలిటేషన్ వల్ల కూడా అదే రిజల్ట్ ఉంటుంది. టెలీ రిహాబిలిటేషన్ థెరపీ ప్రభావంపై 27 స్టడీస్ జరిగాయి. రెండింటి వల్ల ఒకే రిజల్ట్ ఉంటుందని వాటిల్లో నిరూపణ అయింది. కాబట్టి పేరెంట్స్ డౌట్ పెట్టుకోకుండా, తప్పకుండా పిల్లలకు టెలీ రిహాబిలిటేషన్ ద్వారా హియరింగ్, స్పీచ్ థెరపీ చేయించాలి.

### ఆన్‌లైన్ స్పీచ్ థెరపీలో.....

హియరింగ్, స్పీచ్ టెలి-ప్రాక్టీస్‌లో వీడియో కాన్ఫరెన్స్, ఇంటరాక్టివ్ యాక్టివిటీస్, అసెస్‌మెంట్ ప్రోగ్రెస్ ట్రాకింగ్ ఉంటాయి.

ఇందులో ప్లాన్ ప్రకారం ముందు పేరెంట్స్‌తో మాట్లాడి, పిల్లల ఆసక్తిని తెలుసుకుంటారు. ఆ తర్వాతనే స్పెషల్ కిడ్స్‌తో కాన్ఫరెన్స్, థెరపీ మొదలుపెడతారు. వర్చువల్ క్లాస్‌లో డ్రాయింగ్ వేయిస్తారు. ఇంట్లో అందుబాటులో వుండే వస్తువులను ఉపయోగిస్తూ, వాళ్ళను చిన్న చిన్న పనుల్లో ఉంచేందుకు ట్రైనింగ్ ఇస్తారు. క్లినిక్‌కు పోవడం ఆగిపోయినప్పటి నుంచి పిల్లలకు ఇవ్వాల్సిన థెరపీని ఈ విధానంలో కంటిన్యూ చేయొచ్చు. రెగ్యులర్ థెరపీ, ఆనలైన్ థెరపీలో కొద్దిపాటి మార్పులుంటాయి. అందుకని, ఆన్‌లైన్ థెరపీ కోసం స్పెషల్‌గా ట్రైన్ అయిన హియరింగ్, స్పీచ్ థెరపిస్ట్‌నే ఎంచుకోవాలి. టెలి రిహాబిలిటేషన్ థెరపీలో ఫ్యామిలీ మెంబర్స్ స్పెషల్ కిడ్స్‌కి సాయం అందిస్తారు. అందువల్ల రిజల్ట్ మెరుగ్గా ఉంటుంది. ప్రయాణాలు లేకపోవడం, కొత్త పరిసరాల్లోకి పోయామన్న ఫీలింగ్ ఉండదు. కాబట్టి, ఇది కిడ్స్‌కి అనుకూలంగా ఉంటుంది. మానసిక ఆందోళనతో, నిరాశలో ఉన్న స్పెషల్ కిడ్స్‌ని ఈ విధంగా బయటపడేయొచ్చు.

## మానసిక రుగ్మత

మానసిక రుగ్మత (Mental Disorder – మానసిక వైకల్యం, Mental Illness – మానసిక అనారోగ్యం) అనగా మనస్సుకు సంబంధించిన ఒక అనారోగ్యం. మానసిక రుగ్మతతో ఉన్న ప్రజలు వింతగా ప్రవర్తిస్తారు, లేదా ఇతరుల దృష్టిలో వీరు వింత ఆలోచనలను కలిగి ఉన్నవారుగా వుంటారు. మానసిక అనారోగ్యం వ్యక్తి జీవితకాలంలో పెరుగుతుండవచ్చు లేదా తగ్గుతుండవచ్చు. ఇది జన్యువులతో, అనుభవంతో ముడిపడి ఉండవచ్చు. మొత్తం మీద మానసిక రుగ్మత మారుతూ ఉంటుందని భావించాలి.

### చరిత్ర

ప్రపంచంలోని అన్ని దేశాలలో ఆరోగ్యం, సామాజిక, మానవ హక్కులు, ఆర్థిక పరిణామాలపై గణనీయమైన ప్రభావాలతో మానసిక రుగ్మతల భారం పెరుగుతూనే ఉంది. మానసిక రుగ్మత తో ప్రపంచవ్యాప్తంగా 264 మిలియన్ల మంది ప్రజలు బాధపడుతున్నారు. పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు దీని బారిన పడుతున్నారు. నిరాశ, నిస్పృహ, బాధ, ఆనందం కోల్పోవడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం, నిద్రలేమి, ఆకలి, అలసట, ఏకాగ్రత లేకపోవడం వంటివి ఈ మానసిక రుగ్మతకు కారణములు. వీటి ప్రభావములతో మనుషులు ఆత్మహత్యలను చేసుకుంటారు. **మానసిక రుగ్మతలు:** నిరాశ (డిప్రెషన్), బైపోలార్ డిజార్డర్, మనోవైకల్యం (స్కిజోఫ్రెనియా), సైకోసెస్, చిత్తవైకల్యం, ఆటిజం. నిరాశ, నిస్పృహ, మానసిక రుగ్మతల ఆరోగ్య పరముగా, సామాజికంగా బయట పడటానికి ప్రజలకు అవకాశం ఉన్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ( W.H.O ) 2013 లో వారి మానసిక ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక 2013–2020 ప్రజలందరికీ ఆరోగ్యాన్ని సాధించడంలో మానసిక ఆరోగ్యం యొక్క పాత్రను గుర్తించింది, మానసిక ఆరోగ్యానికి మరింత సమర్థవంతమైన నాయకత్వం పాలన, సమాజ–ఆధారిత అమరికలలో సమగ్ర, అందరికి మానసిక ఆరోగ్యం, సామాజిక సంరక్షణ సేవలను అందించడం, అమలు, నివారణ కోసం వ్యూహాల అమలు, సమాచార వ్యవస్థలు, పరిశోధనలను బలోపేతం చేసింది. 2008 లో ప్రారంభించిన W.H.O యొక్క మెంటల్ హెల్త్ గ్యాప్ యాక్షన్ ప్రోగ్రామ్ (mhGAP), ప్రపంచ దేశాలలో సేవలను విస్తరించడానికి, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమం.

### లక్షణములు

మానసిక రుగ్మత , మానసిక అనారోగ్యం అనేక రకములుగా ఉండవచ్చును, అందరికి ఒకే లాగ ఉండవు. అయితే కొన్ని సాధారణ లక్షణాలను పరిశీలించా వచ్చును, వాటిలో సరైన ఆహారం తీసుకోకపోవడం, నిద్రలేమి లేదా ఎక్కువ నిద్ర, ఇష్టమైన కార్యకలాపాల నుండి దూరం చేయడం, శరీర నొప్పులు, నిస్సహాయంగా ఉండటం, ధూమపానం, మద్యపానం, మత్తు మందులు వాడటం, మతిమరుపు, చిరాకు, కోపం, ఆందోళన, విచారం లేదా భయం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో నిరంతరం పోరాటం, వాదించడం, మానసిక స్థితి, వెనుకటి ఆలోచనలను తలచుకోవడం, రోజువారీ కార్యకలాపాలు, పనులను నిర్వహించలేకపోవడం, మానసిక క్షోభ ఇవి అన్ని మానసిక రుగ్మత లక్షణములుగా ఉదహరించవచ్చును.

### నిర్ధారణ – చికిత్స

మానసిక ఆరోగ్య రుగ్మతలకు చికిత్స ఒకటే సరిపోదు, ఇది నివారణను అందించదు. దీనికి వైద్యులు పలు రకాలుగా చికిత్స లక్షణాలను గమనించి, తగ్గించడం వంటివి చేస్తారు. మానసిక ఆరోగ్య రుగ్మతలకు చికిత్స చేయడానికి నాలుగు రకములుగా విభజించి, ఈ మందులతో వైద్యం చేయడానికి ప్రయత్నిస్తుంటారు, అవి యాంటిడిప్రెసెంట్స్, యాంటీ-యాంగ్జైటీ మందులు, యాంటిసైకోటిక్ మందులు, మూడ్-స్టెబిలైజింగ్ మందులు. వైద్యులు సైకోథెరపీ, ఆసుపత్రి, ఇంటిలో చికిత్స జీవనశైలి చికిత్స, మానసిక ఆరోగ్య చికిత్స లాంటివి మానసిక రుగ్మత బారిన పడిన వ్యక్తులకు చికిత్స చేస్తారు.

### భారత దేశం లో మానసిక రుగ్మత రోగులు

ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడం, మానసిక ఆరోగ్యానికి మద్దతుగా ప్రయత్నాలను సమీకరించడం మొత్తం లక్ష్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (W.H.O) తెలిపిన నివేదిక ప్రకారం, భారతదేశంలో మానసిక ఆరోగ్య శక్తి అంతగా లేదని, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్యతో పోల్చితే దేశంలో మానసిక వైద్యులు, మనస్తత్వవేత్తల కొరత ఎక్కువగా ఉందని W.H.O పేర్కొంది. భారతదేశంలో, (100,000 జనాభాకు) మనోరోగ వైద్యులు (0.3), నర్సులు (0.12), మనస్తత్వవేత్తలు (0.07), సామాజిక కార్యకర్తలు (0.07) ఉన్నారని W.H.O పేర్కొంది, అయితే కావాల్సిన సంఖ్య 100,000 జనాభాకు 3 మానసిక వైద్యులు, మనస్తత్వవేత్తల కంటే ఎక్కువ, 7.5 శాతం మంది భారతీయులు కొంత మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని W.H.O అంచనా వేసింది , ఈ సంవత్సరం చివరినాటికి భారతదేశంలో సుమారు 20 శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య లెక్కలను చూస్తే 56 మిలియన్ల భారతీయులు నిరాశతో బాధపడుతున్నారు, 38 మిలియన్ల మంది భారతీయులు ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారు.

## వృద్ధాప్యానికి ఆహ్వానం

వృద్ధాప్యం ఒక మజిలీ.
ప్రతీ వ్యక్తీ కోరుకున్నా, కోరుకోక పోయినా తప్పని సరిగా చేరుకునే మజిలీ.
వయస్సులోని కోరికలన్నింటికీ సెలవిచ్చి,
అలసిపోయిన అనుభవాలనీ,
ఆరిపోయిన అనుభూతులనూ
నెమరు వేసుకునే చలివేంద్రం.
వృద్ధాప్యం ఒక అవకాశం.
వెనక్కి తిరిగి చూసుకుని,
చేసిన తప్పిదాలకు నవ్వుకుని,
దాటిన అడ్డంకులను పరామర్శించి,
ఇక దాటనక్కరలేని స్థితికి వచ్చినందుకు ప్రశాంతంగా నిట్టూర్చే ఆటవిడుపు.
ముసిలితనం కొడుకు కంటె ఒక అడుగు వెనక నడిపిస్తుంది.
మనవరాలి భుజాన్ని ఆసరా చేసుకుంటుంది.
జీవితమంతా కొరుకుడు పడని నిజాలతో ఆనందంగా రాజీపడేటట్టు చేస్తుంది.
పిల్లలు "నీకేం తెలీదు నాన్నా!" అంటే కోపం రాదు.
ఒక జీవిత కాలాన్ని 'తెలీని తనానికి తాకట్టు' పెట్టిన కొడుకుని చూసి నవ్వు కుంటుంది.

తనకి తెలీదని పక్కకి తప్పించే తరాన్ని చూసి గర్వ పడుతుంది.
అవలీలగా అర్థం చేసుకుంటుంది. "వాడికి తోచినట్టే చెయ్యనివ్వండి" అనే భార్య హితవుకి గంభీరంగా తలవొంచుతుంది.
ఏ విమర్శా అవమానం అనిపించదు.
ఏ నిందకీ కోపం రాదు.
వృద్ధాప్యాన్ని అందరూ గౌరవిస్తారు.
నీ జీవితకాలంలోని సాధనల్ని పక్కనపెట్టి, కేవలం వయస్సు కారణంగానే పెద్దరికాన్ని అంగీకరిస్తారు.
అదొక అంతస్థు.
అతని హితవుని నలుగురూ వింటారు, నీ ఆలోచనని గౌరవిస్తారు.
దాన్ని పాటించరని అర్థమవుతున్నా కోపం రాదు.
వయస్సు అర్థం చేసుకునే సంయమనాన్ని నేర్పుతుంది.
"మా రోజుల్లో..." అని చెప్పుకోవడంలో చిన్న 'సాకు'ని వృద్ధాప్యం మప్పుతుంది.
"ఈ కాలం కుర్రాళ్లు..." అన్న వెక్కిరింతకి అర్హతని సంపాదించి పెడుతుంది.
తన గురించి తన పెద్దలూ అలనాడు.. అలాగే అనుకొని ఉంటారని అప్పుడు జ్ఞాపకం వస్తుంది.
వేసిన ప్రతీ అడుగూ తెలిసి వేసే నమ్మకాన్నిస్తుంది.
చేసే ప్రతీ పనీ యిబ్బంది లేని,
శ్రమ అనిపించని మార్గం వేపే ప్రయాణం చేయిస్తుంది.
తన 'రేపు' క్రమక్రమంగా కురుచనయి పోతోందని అర్థమవుతూంటుంది.
దక్కిన చిన్న తప్పుల్ని వృద్ధాప్యం భద్రంగా అలంకరించుకుంటుంది.
"మనకి చేతకాదు" అని చెప్పడం పెద్ద అర్హతగా కనిపిస్తుంది.
అసాధ్యానికి 'అనవసరం' అంటూ గడుసుదనం చిన్న ముసుగువేస్తుంది.
దానికి ఊతం వృద్ధాప్యం.
జీవితంలో చాలా ప్రశ్నలకు సమాధానాలు అర్థమవుతూంటాయి.
ఇప్పుడా సమాధానాలకూ వేళ మించిపోయిందని అర్థమవుతుంది.
ఈ సమాజంలో అవినీతి అనే కుళ్లు ఎప్పుడు తొలగుతుంది?
ప్రతీక్షణం దోపిడీకి గురవుతున్న ఈ పర్యావరణం ఒక్కసారి ఎదురు తిరిగితే ఏమవుతుంది?
ఏమయినా తనకేం బాధలేదు.
ఆ సమయంలో తను ఉండదు.
ఈ జీవిత నుంచి శలవు తీసుకోవడమే తనకి ఉపశమనం.
దేవుడు ఎక్కడ ఉంటాడు?
ఎలా వుంటాడు?
మృత్యువు తరువాత ఏమవుతుంది?
సమాధానాలు అర్థమయే క్షణాలు దగ్గరవుతున్నాయి.
చుట్టూవున్న జీవితాన్ని క్రమంగా ఖాళీ చేసుకుంటుంది వృద్ధాప్యం.
చిన్నకేక తుళ్లిపడేటట్టు చేస్తుంది.
చిన్న నిశ్శబ్దం ప్రశాంతంగా ఉంటుంది.
ఎప్పటిలాగే తెల్లారి,
వృద్ధులతో కలిసి నడిచి,
రెండుముద్దల అన్నం తిని,

అరగంట సేదతీరి,
వేడి టీ తాగి,
సాయంకాలం పార్కు బెంచీ దగ్గర 'ఈ దేశం తగలడి పోతోంద'ని తిట్టుకుని,
శాంతపడి,
కీళ్ల నొప్పులకు మాత్రలు మింగి,
రాని నిద్రనీ,
నిన్నటి జ్ఞాపకాలనీ నెమరు వేసుకోవడం – వృద్ధాప్యం వ్యసనం.
ఇప్పుడు విచారం దగ్గరకు రాదు.
వెళ్లిపోయిన హితులూ,
సన్నిహితులూ దిగులుగా జ్ఞాపకం వస్తారు.
ముగింపు భయపెట్టదు.
ఎందుకంటే భయపడినా రాకతప్పదు కనుక.
అన్నిటినుంచీ, అందరినుంచీ
తనని కుదించుకుని – మెల్లగా అంతర్ముఖుడు కావడం వృద్ధాప్యం.
ఇప్పుడు అన్ని దురదృష్టాలకూ కారణాలు అర్ధమౌతాయి.
చేసిన తప్పిదాలు,
మాటతప్పిన కప్పదాట్లూ,
మనసు నొప్పించిన చిన్న చిన్న జ్ఞాపకాల ముళ్లూ –
అవన్నీ ఓ జీవితకాలం ఆలస్యంగా కళ్లముందు కదుల్తాయి.
ఈ అనుభవాల్ని హెచ్చరికలు చెయ్యబోతే పిల్లలు వినరు.
వినినట్టు నటిస్తారు.
నటిస్తున్నారని తనకీ తెలుసు.
విన్న తృప్తిని తానూ నటిస్తాడు.
వారికీ వృద్ధాప్యం ఒకనాడు పాఠాలు చెప్తుందని తెలుసు.
కాని వృద్ధాప్యం
ఒక వరమని ఇప్పుడు చెప్పి ఒప్పించలేడు.
వారు ఒప్పుకునే వేళకి తను ఉండడు.
జీవితం ఎంత విచిత్రం! నవ్వుకుంటాడు.
ఆ నవ్వు ఖరీదు ఒక జీవితం.
'చమకం'
ఏ ఋషి,
ఏ మహానుభావుడు ఎప్పుడు సృష్టించారో,
ఎంత ముందుచూపు,
ఎంత వినయసంపద,
జీవుని నిస్సహాయత,
నిర్వేదం – అందులో ఎంత నిక్షిప్తమయి వుందో,
ఆనాటి కోరిక సంపూర్ణమయిన స్వరూపంతో కళ్లముందు దర్శనమిచ్చేనాటికి –
తాను జీవితమంతా కోరుకున్న 'వృద్ధాప్యం'

తనని ఆవరించుకుని ఉంటుంది.

ఈ దేశపు వేదసంపద, సాంస్కృతిక వైభవం,

జాతి దర్శనం అపూర్వం, అనన్యసామాన్యం.

చమకంలో

'వృద్ధం చమే'

అనే ఒక్క కోరికా

ఈ జాతినీ,

మతాన్నీ,

ఆలోచనా స్రోతస్సునీ అత్యద్భుతంగా ఆవిష్కరించే అభిజ్ఞ.. వరం.

భగవంతుడిని కోరడంలోనే భగవంతుడు ప్రసాదించిన తన ఆలోచనా పరిణతిని అలంకరించే భగవద్దత్తమైన ఆశీర్వాదం.

అదీ వృద్ధాప్యం

**– శ్రీ గొల్లపూడి మారుతీరావు**

## మంచి మాట

చిరునవ్వు, నిశ్శబ్దం రెండూ శక్తివంతమైనవి.

మొదటిది చాలా సమస్యలను పరిష్కరిస్తుంది, రెండవది చాలా సమస్యలను నివారిస్తుంది.

---

కాలానికి మనమిచ్చే విలువ మన విలువను పెంచుతుంది ..... డబ్బుకి మనం ఇచ్చే విలువ ఆపదలో ఆదుకుంటుంది.....

మనిషికి మనం ఇచ్చే విలువ మనసులో సుస్థిర స్థానాన్ని నిలుపుంటుంది .....

నీ ఆనందాన్ని పంచుకునే వారి కంటే , నీ బాధను పంచుకునే వారికే ఎక్కువ విలువ ఇవ్వు.

ఎందుకంటే ఆనందం అందరూ పంచుకుంటారు  కాని బాధ మనవాళ్ళు మాత్రమే పంచుకుంటారు

---

సంపన్నులకే సంపద పంచినంత కాలం ....... పేదలకు పేదరికం పంచడమే మిగులుతుంది .........

'విధేయత' అనే ఆయుధంతో.....

'విశ్వసనీయత'తో కూడిన విలువలతో.....

'వినయమ'నే కిరీటాన్ని శిరసున ఉంచి.....

'విలువలు అనే సింహాసనం మీద.....

'విశ్వవిజేత'గా నిన్ను కూర్చోపెట్టగలిగేదే......

**"విద్య"**

# మానసిక రుగ్మతను కలుగజేసేదేమిటి?

**భౌతిక లక్షణాలు:**

**నాడీ సంబంధిత ప్రసరణ వ్యవస్థ (న్యూరో ట్రాన్స్‌మిటర్స్):**

మానసిక రుగ్మతలు మెదడులోని న్యూరో ట్రాన్స్‌మిటర్స్ అని పిలువబడే ప్రత్యేక రసాయనాలలో కలిగే అసాధారణమైన సమతుల్యానికి సంబంధం కలిగి ఉంటాయి. మెదడులో ఉండే నాడీ కణాలు ఒకదానితో మరొకటి సంబంధాన్ని నడుపుతూ ఉండడానికి సహకరించుకుంటాయి. ఒకవేళ ఈ రసాయనాలలో సమతౌల్యం లోపించినా లేక అవి సరిగా పనిచేస్తూ ఉండకపోయినా, మెదడులో సంకేతాలు ఒకచోట నుండి మరొకచోటుకు సరిగా పంపబడుతూ ఉండవు, మానసిక అనారోగ్య లక్షణాలకు దారి తీస్తాయి.

**జన్యు శాస్త్రం (వారసత్వం ద్వారా సంక్రమించేవి);**

కుటుంబాలలో వస్తూ వుండే మానసిక రుగ్మతలు తమ కుటుంబంలో మరో ఏ సభ్యుడికైనా అటువంటివి ఉన్నట్లయితే, మిగతా వారు కూడా అటువంటి మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలను ఎక్కువగా కలిగి ఉంటారని సూచిస్తున్నాయి. అయితే ఇటువంటి పరిణామం వంశానుగతంగా సంక్రమించిన జన్యువుల వల్లనే సంభవిస్తుందనే కారణం మీదనే ఈ సమస్యను నెట్టివేయడం జరుగుతుంది. నిపుణులు కేవలం ఇది ఒక దానిలో మాత్రమే కాదు, అనేక మానసిక రుగ్మతలలు జన్యువులలో వుండే అసాధారణ అంశాలతో సంబంధం కలిగి వుంది అని అభిప్రాయపడుతున్నారు. అందుచేత, మానసిక రుగ్మత బారిన పడే అవకాశాన్ని ఒక వ్యక్తి వంశానుగతంగా కలిగి వుంటాడు. అంతే గానీ, స్వత: సిద్ధంగా అటువంటి ఏ వ్యక్తి కూడా తప్పనిసరిగా ఈ వ్యాధిని కలిగి వుండాలని ఏమి లేదు. మానసిక రుగ్మత, వైకల్యం అనేది అనేక జన్యువుల పరస్పర క్రియ, ప్రభావం (ఇంటరాక్షన్) వల్ల మరియు ఇతర అంశాల వల్ల – అంటే వత్తిడి, దుర్వినియోగం, లేకపోతే ఒక శరాఘాతం (ట్రామా) కలిగించే సంఘటన వంటి వాటి వల్ల సంభవిస్తుంది. ఒక వ్యక్తి వారసత్వంగా ఈ రుగ్మతకు గురయ్యే అవకాశాన్ని కలిగి వున్నప్పుడు ఆ వ్యక్తిలో ఇవి అనారోగ్యాన్ని మరింత ప్రభావితం చేయడమో లేక అనారోగ్యాన్ని ఉసిగొల్పడమో చేస్తాయి.

**అంటురోగాలు:**

మెదడు దెబ్బతినడానికి మరియు మానసిక రుగ్మత వృద్ధి చెందే లేక క్షీణించిపోతు ఉండే పరిస్థితిని తెలియజేసే రోగ లక్షణాలతో సంబంధం కలిగి ఉంటాయి. ఉదాహరణకు పీడియాట్రిక్ ఆటో ఇమ్యూన్ న్యూరో సైకియాట్రిక్ డిజార్డర్ (పి.ఏ.ఎన్.డి.ఏ)గా పిలువబడే పరిస్థితి పిల్లలలో స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా అనే ఒబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ (ఓ.సీ.డి.) (నిరంతరం ఒకే భావంతో ఉండే స్థితి – తప్పనిసరి, బలవంతమైన వైకల్యం) మరియు ఇతర మానసిక రుగ్మతలు పెరగడంతో సంబంధం కలిగి వుంటుంది.

**మెదడులో లోపాలు లేక గాయం;**

మెదడులో లేక మెదడులోని కొన్ని భాగాలలో లోపాలు కలగడం లేక గాయాలు కలిగి వుండడం అన్నది కొన్ని మానసిక రుగ్మతలతో సంబంధం కలిగి వుంటుంది.

జాతీయ మానసిక ఆరోగ్య విధానాలు కేవలం మానసిక వైకల్యాలకే సంబంధించిన వాటికే పరిమితమై ఉండకూడదు. అవి మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే ఇతర విస్తృతమైన అంశాలను గుర్తించి వాటిని కూడా చక్కబెట్టేవిగా వుండాలి. అవి సామాజిక జనస్రవంతిలో ఆరోగ్యాన్ని అమలు పరిచే విధానాలుగా, కార్యక్రమాలుగా ప్రభుత్వంలోనూ మరియు వ్యాపార సంస్థలలోనూ, విద్య, శ్రామిక శక్తి, న్యాయం, రవాణా, పర్యావరణం, గృహవసతి మరియు సంక్షేమం, అలాగే ఆరోగ్య రంగంలోనూ కూడా పెంపొందిచబడి, ప్రోత్సహించబడడంతో సహా ఇమిడి ఉంటాయి.

**ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క స్పందన?**

మానసిక అనారోగ్యం సాంఘికపరమైన సమస్యలకు కూడా దారితీస్తుంది.

# యుగపురుషుడు శ్రీ రామకృష్ణ పరమహంస

**శ్రీ రామకృష్ణ జననం:**

క్షుదిరామ్ (రామకృష్ణుల తండ్రి) కాశీ క్షేత్రాన్ని సందర్శించారు. కాశీలో విశ్వనాథుని సేవించి అక్కడ నుండి బయలుదేరి గయలో క్షుదిరామ్‌కు ఒక అద్భుత అనుభూతి కలిగింది. ఆయనకు స్వప్నంలో శ్రీరాముడు సాక్షాత్కరించి, 'నేను నీ బిడ్డగా జన్మిస్తాను' అని పలికాడు. అప్పుడు క్షుదిరామ్, ప్రభూ! "పేద బ్రాహ్మణుడైన నేను మిమ్మల్ని ఎలా సేవించుకోగలను?" అని అడిగారు. అందుకు శ్రీ రాముడు 'ఆందోళన చెందకు, అది నిర్వహింపబడుతుందిలే" అని జవాబిచ్చాడు. గయ క్షేత్ర సందర్శన అనంతరం క్షుదిరామ్ కామార్పుకుర్‌లో వున్న తన ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంతలో చంద్రాదేవి (రామకృష్ణుల తల్లి) అద్భుతానుభూతులను చవి చూడసాగింది. ఒక రోజు ఆమె తన ఇంటి సమీపంలో ఉన్న శివాలయానికి తన నేస్తం, పొరుగింటి స్త్రీ అయిన ధనితో కలిసి వెళ్ళింది. అక్కడ నిలబడి ఉండగా, శివుని విగ్రహం నుండి దివ్యతేజోపుంజం వెలువడి తన శరీరంలో ప్రవేశింప పరవశు రాలై శరీరస్మృతి కోల్పోయింది. ధని ఆమెకు సేదదీర్చి జరిగిన కథ విని అబ్బురపడి, అది నరాల బలహీనత చేత కలిగిన మూర్ఛ అనుకుంది. కానీ చంద్రాదేవికి తాను గర్భం దాల్చినట్లు తోచసాగిందట. చంద్రాదేవి తన ఆద్భుతానుభవాలను భర్తకు తెలుపగా, అతడు గయలో తనకు కలిగిన దివ్య స్వప్నాన్ని గురించి ముచ్చటించి, అంతా భక్తవత్సలుడైన రఘువీరుని వాత్సల్య విశేషమనీ, దివ్య పుత్ర జననంతో తమ జన్మ ధన్యము, తమ గృహం పావనము కానున్నవని ఆమెకు వివరించాడు. చంద్రాదేవి సహజ ప్రేమానురాగాలు శతగుణాధికమై ఎల్లరి పట్లా ప్రసరింపసాగాయి. ఆమె ప్రవర్తనలోని ఈ విశేష పరిణామమే గయ నుండి తిరిగి వచ్చిన క్షుదిరామ్‌ను మొట్టమొదట ఆకర్షించిన విషయం. తను కష్టసుఖాలను కించిత్తు లెక్కించక,రాత్రనక పగలనక స్వయంగా వెళ్లి కనుగొని యిరుగు పొరుగు వారికి ఆమె ఎంతో ఉత్సాహంతో నానా విధాల తోడ్పడసాగింది. అవసరమయితే తాను పస్తుండి అయినా వారికి అన్నాదులను పెట్టేది. చంద్రాదేవి ఈ కాలంలో దాదాపు ప్రతిరోజు ఏదో ఒక దివ్య దృశ్యం కాంచటమో, దివ్యవాణి ఆలకించటమో, దివ్యానుభూతి పొందడమో జరిగేదట.

చంద్రాదేవికి పుత్రోదయ సమయం ఆసన్నమైంది. అది మన్మథనామ సంవత్సర ఫాల్గుణ శుక్ల ద్వితీయ బుధవారం సుప్రభాతం – 1836 వ సం. ఫిబ్రవరి 8వ తేది. సూర్యోదయానికి సరిగ్గా అరఘడియ పూర్వం పరమ శుభ ముహూర్తాన ఆమెకు పుత్రోదయమైంది. పుత్ర జనన మహోత్సహ సూచకాలై, క్షుదిరామ్



గృహం నుండి గంభీర శంఖారావాలు నినదించాయి. జ్యోతిషవేత్తయైన క్షుదిరామ్ జాతక గణనం చేసి శిశువుకు మహోన్నత భవిష్యత్తు వుందని గ్రహించాడు. కాలక్రమాన సుప్రసిద్ధ జ్యోతిష పండితులు దానిని ధృవీకరిస్తూ పరమ శుభలగ్నంలో మహోత్తమ గ్రహసంయోగాలలో ఉదయించిన అ బాలుడు ఆచంద్రతారార్క యశస్సాంద్రుడైన మహనీయుడై విరాజిల్లుతాడని వక్కాణించారు. క్షుదిరామ్ గయలో తనకు కలిగిన దివ్యానుభూతి మేరకు ఆ బాలునికి గదాధర్ అని నామకరణం చేసాడు. అతడి ముద్దు పేరు గదాయ్.

టి. అప్పారావు
గౌరవ అధ్యక్షులు
సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ది డెఫ్ అండ్ బ్లైండ్
విజయనగరం

# అభిప్రాయం: 'వికలాంగులకి కావలసింది ఏంటి?

నేనొక లాయర్‌ను. సామాజిక కార్యకర్తను. తెలుగు మహిళను. రచయితను.. ఆర్టిస్ట్‌ను / సింగర్‌ను.. ఇంకా చెప్పాలంటే జీవితాన్ని అన్ని కోణాల నుంచి అనుభవిస్తూ, పరిశీలిస్తున్న మానవ చలనశీలిని.

'అబ్బే.. ఇదేం పరిచయం? మాకు నచ్చలేదు' అంటారా.. అయితే నాకో ప్రత్యేక ముద్ర ఉంది. ఆ ముద్ర పేరు శారీరక వికలాంగురాలు.

మోదీ గారి భాషలో చెప్పాలంటే దివ్యాంగురాలిని. అంతర్జాతీయ డిజేబిలిటీ పరిభాషలో చెప్పాలంటే, "పర్సన్ విత్ డిజేబిలిటీ"ని. కానీ అంతకంటే ముందుగా మనిషిని. తర్వాతే నా ఎబిలిటీ అయినా డిజేబిలిటీ అయినా.

ముందుగా దివ్యాంగుడు లేదా దివ్యాంగురాలు అన్న పదాలను 'డిజేబిలిటీ కమ్యూనిటీ' ఒక అభ్యంతరకరమైన మాటగా పరిగణిస్తోంది.

దాన్ని ప్రభుత్వానికి ఎందుకు వాడానో చెప్పే ముందు.. మీకో చిన్న కథ చెప్తాను.

నా ప్రత్యేక గుర్తు మీకు చెప్పాను కదా.. పర్సన్ విత్ డిజేబిలిటీ. చిన్నప్పుడే వచ్చిన పోలియో వల్ల పూర్తి శరీరం చచ్చుబడి పోయింది మాటతో సహా!

షాక్ ట్రీట్మెంట్ వల్ల మాట.. శరీరం పైభాగంలో చలనం వచ్చింది. కాళ్ళు మాత్రం ఇంకా చచ్చుబడే ఉన్నాయి.

అయినా నేనెప్పుడూ నడిచే ప్రయత్నం మానలేదు. ఎడిసన్ ప్రయోగాల్లా నా నడక ప్రయోగాలు కూడా తక్కువేం కాదు.

రకరకాల బ్రేసేస్ అనబడే కేలిపర్స్ (నడవటం కోసం కాళ్ళకి వేసుకొనే పరికరాల్లాంటివి.)తో ప్రయోగాలు, ఇంకా రకరకాల థెరపీలు, సర్జరీలు ఇలా ఓ ఎపిసోడ్ లెక్కన నడిచే ఈ రిహాబిలిటేషన్‌లో నేనెప్పుడూ మా అమ్మకు కంప్లైంట్ చేసేదాన్ని –

"అమ్మా.. మూడు అడుగులు ముందుకి వేస్తే, రెండు అడుగులు వెనక్కి అవుతోంది.. ఇలా అయితే ఎప్పటికి?" అని. అమ్మ నవ్వుతూ అనేది "మొత్తం మీద ఒక అడుగన్నా ముందుకు పడుతోంది కదరా!.." అని. చాలా గొప్పగా, ఇన్స్పిరేషన్ గా అనిపించేది ఆ మాట.

**డిజేబిలిటీని గవర్నమెంట్‌నీ పోల్చి చూద్దాం..**

'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఫర్ రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్' (యూఎన్సీఆర్పీడీ) వికలాంగుల హక్కులకు సంబంధించి అతి ముఖ్యమైన ఈ ట్రీటీని అంగీకరిస్తూ సంతకం చేసిన దేశాల్లో భారత దేశం మొదటి వరుసలో ఉంది.

అది అలాగే అమలు పరిస్తే మనం ఎన్నో అడుగులు ముందుకి వేసినట్లే. కానీ.. ఇటీవల సుప్రీం కోర్ట్ 'జనీష్ కుమార్ పాండే వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సంచలన వ్యాఖ్యలు చేసింది. అందులో ముఖ్యమైనవి –

వికలాంగ పిల్లల్ని, బుద్ధి మాంద్యం కలిగిన పిల్లల్ని ఒకటే స్కూల్లో చేర్పించడం కుదరదు కాబట్టి, వారి కోసం స్పెషల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి.

అదే విధంగా చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్‌కి వేరే ఎడ్యుకేటర్లను నియమించి చదువు చెప్పించాలి.

ఈ వ్యాఖ్యలు డిజేబిలిటీ కమ్యూనిటీని తీవ్ర దిగ్భ్రాంతికి, నిస్సహాయతతో కూడిన ఆశ్చర్యానికి గురి చేశాయి. 'ది రైట్స్ అఫ్ పర్సన్స్ విత్ దిజేబిలిటీస్ ఏక్ట్-2016' ప్రకారం..

చట్టం ముఖ్య ఉద్దేశ్యం ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించి, భారత దేశం అంగీకరించిన 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ రైట్స్ అఫ్ పర్సన్స్ విత్ దిజేబిలిటీస్'ని యథాతథంగా అమలు పరచటం.

ఈ డిక్లరేషన్ మీద భారత్ 13వ తేదీ డిసెంబర్ 2006 న సంతకం చేసింది.

**ది రైట్స్ అఫ్ పర్సన్స్ విత్ దిజేబిలిటీస్ ఏక్ట్-2016' ముఖ్య ఉద్దేశాలు**

ప్రతీ ఒక్కరికీ సమాన గౌరవం, వ్యక్తిగత స్వాతంత్ర్యం.
ఏ రకమైన వివక్ష లేకుండా ఉండటం.
సమాజంలో ప్రతీ ఒక్కరికీ సమాన అవకాశాలు, ప్రతిపత్తి కలిగించటం.
వికలాంగులలో ఉన్న తేడాలను గుర్తించి, గౌరవంతో అంగీకరించటం.
సమాన అవకాశాలు.
బేరియర్ రహిత సమాజం కల్పించటం.
పురుషులూ, మహిళల మధ్య సమానత్వం.
స్పెషల్ చిల్డ్రన్ / చిల్డ్రన్ విత్ డిజేబిలిటీస్ లో అంకురిస్తున్న విభిన్న ప్రతిభను గుర్తించి, గౌరవించి. వారిని వారి స్పెషల్ కెపాసిటీలతో ఎదిగేందుకు దోహదం చేయటం.
ఇలా పైన ఉదహరించిన లక్ష్యాలు, పాలసీగా ఏర్పడిన చట్టం 'రైట్స్ అఫ్ పర్సన్స్ విత్ దిజేబిలిటీస్ ఆక్ట్-2016'.

ఇది ఏర్పడి ఇంకా సరైన ఫ్రేం వర్క్ కూడా మొదలు కాలేదు.. ఈలోపు ఇలాంటి వ్యాఖ్యలు తీవ్ర నిరాశని కల్గిస్తాయనటంలో సందేహం లేదు.

ఇది మూడు అడుగులు ముందుకు వెళ్తున్న ఇంక్లూజన్‌ని నాలుగు అడుగులు వెనక్కి లాగుతోంది.

ఇది సుమారు ఏడు కోట్ల వికలాంగుల హక్కుల సమస్య. వారి ఆత్మగౌరవ సమస్య.

ఇకపోతే సుప్రీంకోర్టు ఈ రకమైన వ్యాఖ్యలు చేయటం రాజ్యాంగ స్ఫూర్తికి అనువుగా లేదు.

ఈ విషయంలో రాజ్యాంగం ఏం చెప్తోందో చూద్దాం: సమానత్వపు హక్కు రాజ్యాంగం అధికరణలు 14, 15, 16, 17 మరియు 18ల ప్రకారం ప్రసాదించబడింది.

ఈ హక్కు చాలా ప్రధానమైనది. స్వేచ్ఛా సమానత్వాన్ని ప్రసాదించే ఈ హక్కు, క్రింది విషయాల్లో గ్యారంటీ ఇస్తుంది:

చట్టం ముందు సమానత్వం : రాజ్యాంగ అధికరణ (ఆర్టికల్) 14 ప్రకారం, పౌరులందరూ సమానంగా, భారతచట్టాల ప్రకారం కాపాడబడవలెను. అనగా ప్రభుత్వం పౌరుల పట్ల ఎలాంటి వివక్షా చూపరాదు. కుల, మత, వర్గ, వర్ణ, లింగ మరియు పుట్టిన ప్రదేశాల ఆధారంగా ఏలాంటి భేదాలూ చూపరాదు.

పౌర ప్రదేశాలలో సామాజిక సమానత్వం మరియు సమాన ప్రవేశాలు : అధికరణ 15 ప్రకారం, పౌరులు పౌర (పబ్లిక్) ప్రదేశాలయిన, పార్కులు, మ్యూజియంలు, బావులు, స్నాన ఘాట్‌లు, మరియు దేవాలయాలు మొదలగు చోట్ల ప్రవేశించుటకు సమాన హక్కులు కలిగి ఉన్నారు. ప్రభుత్వాలు పౌరుల పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు.

పౌర ఉద్యోగాల విషయాలలో సమానత్వం : అధికరణ 16 ప్రకారం, ఉద్యోగాలు పొందేందుకు, ప్రభుత్వాలు పౌరులందరికీ సమాన అవకాశాలు మరియు హక్కులు కల్పించవలెను. ప్రభుత్వాలు పౌరుల పట్ల ఎలాంటి వివక్షా చూపరాదు.

ఒక డిజేబిలిటీ యాక్టివిస్ట్‌గా నిత్యం వికలాంగ పిల్లలు, అడల్ట్స్ మధ్య ఉండే నన్ను వాళ్ళ ప్రతిభా పాటవాలు ఎంతో ఆశ్చర్యపరుస్తాయి. నిత్యం ఇన్స్పైర్ చేస్తూ ఉంటాయి కూడా! చిన్నప్పుడు మొదటి అంతస్తులో పాటల పోటీలు పెడితే నేను వెళ్ళలేనని, మా క్లాస్ పిల్లలందరూ కలసి స్కూల్ ఆవరణలోనే ఓ చెట్టు కింద పోటీలు పెట్టించిన నేపథ్యం నాకు గుర్తొస్తోంది.

చట్టాలు పెరుగుతున్నా అవగాహన లేని ఈరోజుల్లో కొన్ని విషయాల్ని గమనించాలి మనం.

సెపరేట్ స్కూల్స్, సెపరేట్ జీవితం.. అప్పుడు ఒకరి బలాలనూ బలహీనతలనూ తెలుసుకొనే అవకాశం ఎలా వస్తుంది?? ఇంక్లూజన్ మరియు సమానత్వం రెండు ముఖ్యమైన పార్శ్వాలు.

నా స్నేహితుడు ఒక విజువల్లీ చాలెంజ్‌డ్ ఉన్నారు. ఆయన వస్తే మాకు చాలా ఉత్సాహంగా ఉంటుంది. ఆయన ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఫోన్‌లో ఉన్న ఏప్స్ ద్వారా ఆయన ఆఫీస్ పనులు నిర్వహించే విధానంతో నేను చాలా నేర్చుకుంటూ ఉ ంటాను.

బధిర పిల్లలు బాడీ లాంగ్వేజ్ ద్వారా, సైన్ లాంగ్వేజీ ద్వారా తెలియపరిచే విధానం, వాళ్ళు మనుషుల్ని, పరిస్థితులనీ బేరీజు వేసే తీరు.. పర్సనాలిటీ డెవెలప్మెంట్ క్లాసుల్లో చెప్పాలని నాకు అనిపిస్తూ ఉంటుంది.

కేవలం ఒక స్పర్శ ద్వారా సెరిబ్రల్ పాల్సీ పిల్లలు.. ఎవరు తమకి స్నేహితులో, లేదా తామంటే ఇష్టం లేని వాళ్ళో గమనించేస్తారు. కొన్నేళ్ల తర్వాత కూడా ఆ స్పర్శలను గుర్తు పెట్టుకుంటారు.

ఈ మధ్య జరిగిన ఒక సర్వేలో 87% వరకూ వికలాంగులకు కేటాయించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు మిగిలిపోతున్నాయి అని తేలింది. ఎక్కడికక్కడ విడిగా సేపెరేట్‌గా చూస్తూ ఉంటే అక్కడిదాకా రావడం ఎలా? హక్కులకి చట్టబద్ధత, న్యాయ నిబద్ధత లేకపోతే సమాన అవకాశాలు ఎలా నెరవేరతాయి?

బ్యాలెన్స్‌డ్ లెర్నింగ్ – నా దగ్గరకి కౌన్సెలింగ్‌కి వచ్చే చాలామంది, ముఖ్యంగా డిజేబుల్డ్ పిల్లల తల్లిదండ్రులు మొదట ఎదుర్కొనే ఇబ్బంది.. తమ పిల్లల కండిషన్ పట్ల యాక్సెప్టెన్స్.

'మా ఇంట్లో ఇలా ఎవరూ లేరండీ..ఈ ఆటిజం అనే పేరు నేను మొదటి సారి వింటున్నాను' అని చెప్తారు.

చాలా బాధ వేస్తుంది. ఎందుకంటే.. మొదటి నుండీ స్కూళ్ళల్లో గానీ, బయట వాతావరణంలో గానీ అలాంటి పిల్లల్ని చూడకపోవటం. వాళ్ళ లెర్నింగ్ కర్వ్ మార్చటంలో చాలా విలువైన సమయం వృధా అవుతుంది.

నార్మల్ లేదా కామన్.. లేదా మామూలు 'ఇలాంటి పదాలకి కొలబద్ద ఏది? ఇవాళ వికలాంగ పిల్లలని విడిగా పెట్టమనే సుప్రీం కోర్ట్ రేపు ముసలివాళ్ళకి వేరే సౌకర్యాలు అవసరం కాబట్టి వాళ్ళని విడిగా పెట్టమంటుంది. నిర్మిద్దామా డిజేబుల్డ్ దేశాల్నీ, ఏజ్డ్ రాష్ట్రాల్నీ ??

మన దేశంలో ఏ హక్కులూ లేనివాళ్లు దేవుళ్ళు మాత్రమే.

స్త్రీని పూజిస్తాం అని చెప్పుకుంటూ, ఆ స్త్రీని మనిషిగా పరిగణించని సమాజంలో బ్రతుకుతున్నాం. అందువల్ల హక్కులు నెరవేరని, హక్కుల కోసం పోరాడనివ్వని దివ్యాంగత్వం తమకి వద్దని ప్రతీ 'పర్సన్ విత్ డిజేబిలిటీ' ఎలుగెత్తి చాటాలి. తన నిరసనని తెలియచేయాలి తమ తమ పద్ధతుల్లో.

హరిజన్' అనే పదం గాంధీజీ ప్రవేశపెట్టినప్పుడు, మరి మిగతావారు 'రాక్షస జనమా' అన్న డాఎఎ అంబేద్కర్ మాటలు గుర్తుకు వచ్చాయి.

మేము 'దివ్యాంగులం' అయితే మరి మిగతా వారు ఏమవుతారు? శాస్త్రీయపరంగా చూస్తే దివ్యత్వమున్న అంగం అంటే అపారమయిన శక్తి కలిగి అనితరసాధ్యమైన పనులు చేయగలిగి ఉండాలి! మరి అలా జరగదే.. కావున 'దివ్యాంగం' అన్న పదమే లోపాయకారిగా ఉంది.

ఒకసారి ప్రకృతిని గమనిస్తే ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. అసలు భిన్నత్వం లేకపోతే మానవ జీవితానికి మనుగడ, సంపూర్ణత్వం లేనే లేదు.

జీవన వైవిధ్యమే మనుగడలో అందం. వైవిధ్యాన్ని అర్థం చేసుకోకుండా సహానుభూతి సాధించటం కష్టం.

అందుకని, ఏవిధంగా చూసినా స్పెషల్ అంటే సెపరేట్ చేయమని కాదు. వారి వారి స్పెషల్/విభిన్న అవసరాలను గమనించటమే! స్పెషల్ ట్రీట్మెంట్ అంటే విడదీయటం కాదు. కుష్టు రోగుల కాలనీలు, శానిటోరియంలూ విడిగా పెట్టేందుకు, డిజేబిలిటీ అన్నది ఒకరి నుండి ఒకరికి సోకే వ్యాధి కాదు.

జీవన వైవిధ్యంలో అదొక అందమైన పార్శ్వం.

చివరగా ఒక్క మాట.. 'వికలాంగులకి కావలసింది ఏమిటి?' అని అందరూ అడుగుతూ ఉంటారు. వికలాంగులకి కావలసింది మనుషులందరికీ కావలసిన కొన్ని ముఖ్యమైన విషయాలే వికలాంగులకూ కావాలి.

అవే.. గౌరవం, స్వాతంత్ర్యం, సమానత్వం. ఇంత సరళమైన వాళ్ళ హక్కులను చాలా నిర్లజ్జగా, ఏమాత్రం ఆలోచన లేకుండా ఎందుకు కాలరాస్తున్నాం? అనే ప్రశ్న ప్రభుత్వాలు, పౌర హక్కుల సంఘాలు, అన్ని కమ్యూనిటీలు తమని తాము వేసుకోవాల్సిన ప్రశ్న.


పురోగమన దిశగా ఆలోచన మొదలవ్వాలి. దానికి వైవిధ్యాన్ని అర్థం చేసుకొనే సహానుభూతి అలవాటు చేయాలి.

ఆ దిశగా ఆలోచన, ఆచరణ, చట్ట భద్రతపై అవగాహన పెరుగుతుందని ఆశిస్తూ .. అందరికీ.. అంతర్జాతీయ వికలాంగ దినోత్సవ శుభాకాంక్షలు.

సాయి పద్మ (లేట్)

గ్లోబల్ ఎయిడ్ వ్యవస్థాపకులు

## Alphabets in Sign Language




## Accessibility Symbols






## OUR GRATITUDE to Maanavseva, Boston, U.S.A.

On behalf of our organization, we express our sincere gratitude to Manavaseva trust of Boston, U.S.A, for their kind support to our VIKAS School for the Intellectually Disabled children, and also for providing HPV cervical cancer vaccination to our children. We also express our gratitude to Dr. Raghunath and Dr. Leela Digumarthi for their untired services in conducting the said camps. May God bless the founder of the trust Sri Sastri Dwivedula garu with lots of happiness, prosperity and health to carry on such activities on a much larger scale.

## SINCERE THANKS to Vasudha Foundation

We express our deep sense of gratitude to Vasudha Foundation for their kind gesture in extending financial support to our organisation since 2013. We expect the same cooperation in future years also. May God bless the founder of Vasudha Foundation Sri Manthena Venkata Ramaraju garu with lots of happiness, prosperity and health to carry on such activities on a much larger scale.

## కృతజ్ఞతాభివందనలు

స్థానిక **శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయ నిత్య అన్న ప్రసాద వితరణ ట్రస్టు** వారు ఫిబ్రవరి 2013 సం॥ నుండి మన పాఠశాలలోని సుమారు 80మంది విద్యార్థులకు మధ్యాహ్నం పూట పోషకాహారాన్ని ఉచితంగా అందజేయుచున్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన గౌ॥ అధ్యక్షులు **శ్రీ ఇ.ఆర్. సోమయాజులు (రాంజీ)**, చైర్మన్ **శ్రీ పెంటపాటి విజయరామయ్య** గారు మరియు ఎడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ అయిన **గౌ॥ శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి** గారికి, ప్రెసిడెంట్ **శ్రీ నారాయణం శ్రీనివాసు** గారికి, గౌ॥ కార్యదర్శి **శ్రీ పి. కామరాజు** గారికి మా సంస్థ తరపున కృతజ్ఞతలు తెలియజేయుచున్నాము.

# EVENTS & ACHIEVEMENTS OF S.M.R.P.R.C School for the Deaf & VIKAS SCHOOL FOR THE M.R

**తే. 26-07-2024 ది :** వైశాఖి దివ్యాంగ విద్యార్థి సేవా ఛారిటబుల్ ట్రస్టు విశాఖపట్టణం వారు పాఠశాల విద్యార్థులకు సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేసినారు. తరువాత పదవ తరగతి విద్యార్థులకు వాచీలు బాహూకరించారు. ఈ కార్యక్రమానికి సేవా సభ్యులు మరియు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**తే. 31-07-2024 ది :** ఈ రోజు పాఠశాలలో మానవ సేవ బోస్టన్ యు.ఎస్.ఏ వారి సౌజన్యంతో సర్వైకల్ క్యాన్సర్ పై అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా॥ లీలా దిగుమర్తి (గైనకాలాజికల్ ఆంకాలజిస్ట్) హైదరాబాదు వారు పాఠశాలకు విచ్చేసారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రెసిడెంటు శ్రీ టి. అప్పారావు గారు సంస్థ గౌరవ కార్యదర్శి కె.ఆర్.డి ప్రసాదరావు గారు, సంస్థ కార్యదర్శి పి.రాజగొపాల్ గారు సంస్థ సభ్యులు పి.శ్రీనివాస్ గారు, సంస్థ సభ్యులు టి.వెంకటేశ్వర రావు గారు, మానవ సేవ ట్రస్టు సభ్యులు శ్రీ సుధాకర్ గారు, వికాస్ తరంగిణి సంస్థ నుండి శ్రీమతి శకుంతల గారు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా॥ లీలా దిగుమర్తి గారు మాట్లాడుతూ, స్త్రీ పురుషులు ఈ సర్వైకల్ క్యాన్సర్ బారిన కొన్ని సందర్భాలలో పడుతున్నారు. మనదేశంలో ఎక్కువ మరణాలు గర్భాశయ క్యాన్సర్ వలనే సంభవిస్తున్నాయి అని అన్నారు. అలాగే మన దేశంలో ఎక్కువ కేసులు వస్తున్నాయని అన్నారు. ఇప్పటికే ప్రపంచంలో ఎక్కువ మంది స్త్రీ పురుషులు హెచ్.పి.వి వ్యాక్సిన్‌ని తీసుకుంటున్నారు. కనుక మన దేశంలో మారుములలో ఉన్న స్త్రీ పురుషులు ఈ క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలి అంటె ఈ హెచ్.పి.వి వ్యాక్సిన్‌ను తీసుకొవాలి అని అన్నారు. దీని వలన ఏ సైడ్ ఎఫెక్ట్స్ రావు అని అన్నారు. సాధారణంగా ఈ హెచ్.పి.వి వ్యాక్సిన్ ఎక్కువ ఖరీదులో ఉంటుంది. అప్పుడు ఈ వ్యాక్సిన్ మనకు అందుబాటులో ఉండేది కాదు. ఇప్పుడు మన దేశంలో కూడా ఈ హెచ్.పి.వి వ్యాక్సిన్‌లు అందుబాటు ధరలో ఉన్నాయి. ఈ హెచ్.పి.వి వ్యాక్సిన్ వ్యాధి సోకకుండా 9 సంవత్సరాల వయస్సు నుండి 14 ఏళ్ళ వయస్సు వారు రెండు డోసులు, 15 ఏళ్ళ మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఆడ మగ వారు ముడు డోసులు తీసుకోవాలని అని అన్నారు. ఈ వ్యాధి గురించి ఏ విధమైన బాధ పడక్కరలేదు అని అన్నారు. ఈ పాఠశాల వారు తల్లిదండ్రులు తమ తమ పిల్లలకి వాక్సిన్‌కి అంగీకారం తెలిపితే మేము వారికి స్క్రీనింగ్ పరీక్షలు చేయడమే కాక ఉచితంగా వాక్సిన్‌ను మానవ సేవ ట్రస్టు వారు సరఫరా చేసారు. గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌లు, నోటి క్యాన్సర్‌లకు ఉచితంగా స్క్రినింగ్ పరీక్షలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సంస్థ గౌరవ కార్యదర్శి శ్రీ కె.అర్.డి ప్రసాదరావు గారు మాట్లాడుతూ మన స్కూల్‌లో ఉన్న 14 ఏళ్ళు దాటిన విద్యార్థులకు హెచ్.పి.వి వ్యాక్సిన్ ఇవ్వడానికి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అనుమతిపత్రం కోరారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని అన్నారు. ఇలా చేయడం వలన భవిష్యత్తులో ఇలాంటి రోగాలు రాకుండా ఉంటాయని తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జె.అప్పలరాజు గారు మాట్లాడుతూ, ఇలాంటి విషయాలను వివరించిన డా॥ లీలా దిగుమర్తి గారికి ధన్యవాదాలను తెలిపారు. తరువాత వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

**తే. 15-08-2024 ది :** ఈ రోజు పాఠశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మా సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీ టి. అప్పారావు గారు మువ్వన్నెల జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సంస్థ గౌరవ కార్యదర్శి కె.ఆర్.డి. ప్రసాదరావు గారు సంస్థ ఉపాధ్యక్షులు శ్రీ టి. వెంకటేశ్వరావు గారు సంస్థ సంయుక్త కార్యదర్శి శ్రీ పి.రాజగోపాల్ గారు మరియు ఇతర సభ్యులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గత విద్యాసంవత్సరం 10వ తరగతి లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేసారు. అనంతరం స్వీట్స్ డిస్ట్రిబ్యుషన్ అతిథుల చేతుల మీదుగా ఇవ్వడం జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జె.అప్పలరాజు గారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

**తే. 19-08-2024 ది :** ఈ రోజు పాఠశాలలో స్థానిక ఇన్స్‌పైరో స్కూల్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు రాఖీ పండగ సందర్భంగా విద్యార్థులచే రాఖీలు కట్టించారు. అలాగే బ్రహ్మకుమారి సమాజం వారు పాఠశాల విద్యార్థులకు రాఖిలు కట్టారు.

**తే. 23-08-2024 ది :** ఈ రోజు టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతిని పాఠశాలలో జరుపుకున్నాము. టంగుటూరి ప్రకాశం పంతులు గారి గురించి విద్యార్థులకు తెలియజేయడమైనది.

**తే. 29-08-2024 ది :** ఈ రోజు స్థానిక పేర్ల వారి వీధిలో గల చెవిటి పిల్లల పాఠశాలలో తెలుగు బాషా దినోత్సవాన్ని జరుపుకున్నాము. తెలుగు గురుంచి పాటు పడిన శ్రీగిడుగురామూర్తి గారి జయంతిని పాఠశాలలో జరుపుకున్నాము. పాఠశాలకు విద్యార్థులకు గిడుగు రామూర్తి గారి గురుంచి తెలియజెయడమైనది.

**తే. 31-08-2024 ది :** ఈ రోజు పాఠశాలలో 61 మంది విద్యార్థినీ విద్యార్థులకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కొరకు వ్యాక్సిన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మానవసేవ బోస్టన్ యు.ఎస్.ఏ వారి సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మానవసేవ ట్రస్టు తరపున గైనకాలాజికల్ అంకాలజిస్టు డా.లీల దిగుమర్తి మరియు డా.రఘునాధరావు గార్లు పాల్గొనడం జరిగింది. అనంతరం శ్రీమతి శంకుతల, కన్వీనర్, మహిళా వికాస్ తరంగిణి, విజయనగరం శాఖ వారి సహకారంతో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీ టి.అప్పారావు గారు సంస్థ ఉపాధ్యక్షులు శ్రీ టి.వెంకటేశ్వర రావు గారు సంస్థ సంయుక్త కార్యదర్శి శ్రీ పి.రాజగోపాల్ గారు సంస్థ సభ్యులు శ్రీ పి.శ్రీనివాసరావు గారు, శ్రీ జగన్నాధరాజు గారు, శ్రీ ఆర్.వి.వి సుబ్బారావు గారు, శ్రీ ఎస్.రాంప్రసాద్ రావు గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జె.అప్పలరాజు మరియు పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**తే. 05-09-2024 ది :** ఈ రోజు సెప్టెంబర్ 5వ తారీఖున డా.సర్వేపల్లి రాధాకృష్ణ గారి జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నాము. ఈ కార్యక్రమానికి సంస్థ గౌరవ కార్యదర్శి శ్రీ కె.అర్.డి ప్రసాదరావు గారు విచ్చేసారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణ గారి గురించి విద్యార్థులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాద్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

**తే. 21-09-2024 ది :** ఈ రోజు గురజాడ అప్పారావు గారి జయంతి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు శ్రీ జె.అప్పలరాజు కలిసి గురజాడ అప్పారావు గారి గృహన్ని సందర్శించారు. అప్పారావు గారి గురించి వారు వ్రాసిన గ్రంధాలు, పద్య కావ్యాల గురించి విద్యార్థులకు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

**తే. 23-09-2024 ది :** ఈరోజు "నేషనల్ సైన్స్ లాంగ్వేజ్ డే" సందర్భంగ పాఠశాలలో దాని ప్రచుర్యం గురుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జె.అప్పలరాజు గారు విద్యార్థులకు తెలియజేసారు.

**తే. 25-09-2024 ది :** అంత్యోదయ దివస్‌ను పురస్కరించుకొని ఆ రోజున పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పాఠశాలలో ఘనంగా జరుపుకున్నాము. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జె.అప్పలరాజు గారు దీన్‌దయాళ్ గారి గురించి విద్యార్థులకు వివరించారు.

**తే. 11-11-2024 ది :** ఈ రోజు పాఠశాలలో మెడికల్ కేంప్ నిర్వహించబడినది. ఈ కర్యక్రమంలో సుమారు 60 మంది విద్యార్థులకు వైద్య పరిక్షలు నిర్వహించి అవసరమగు మందులను డాక్టర్లు సూచించారు. ఈ కర్యాక్రమంలో ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ డి.వి. శ్రీకాంత్, ప్రముఖ ఇ.ఎన్.టి వైద్య నిపుణులు డాక్టర్. కె.నాగమనోహార్‌లు పాల్గొన్నారు. ఈ కర్యాక్రమంలో సంస్థ వ్యవస్థావక కార్యదర్శి శ్రీ వై.విష్ణు గారు గౌరవ అధ్యక్షులు శ్రీ టి.అప్పారావు గారు, సంస్థ గౌరవ కార్యదర్శి శ్రీ కె.ఆర్.డి. ప్రసాదరావు గారు, సంస్థ సంయుక్త కర్యదర్శి పి.రాజగోపాల్ గారు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

**తే. 18-11-2024 ది :** ఈ రోజు గురజడ గ్రంధాలయం వారు డ్రాయింగు కాంపిటీషన్ నిర్వహించారుఈ ఈ పోటీలకు స్కూల్ తరపున 10 మంది విద్యార్థులు హజరు అయినారు. పొటీలో పాల్గొన్నారు వారందరికీ కాన్సోలేషన్ బహుమతులను ఇచ్చారు. వీరిలో ఇద్దరికి ప్రధమ, ద్వితీయ బహుమతులు వచ్చాయి.

**తే. 26-11-2024 ది :** ఈ రోజు శ్రీ రవికుమార్ వారి స్నేహబృందం టి.సి. లెఔట్ విజయనగరం లో ఏర్పటు చెసిన వన మహోత్సవానికి పాఠశాల విద్యార్థులు మరిలు సిబ్బంది పాల్గోన్నారు. ఈ కార్య క్రమం చింతలవలస తోటలో ఏర్పాటు చేసారు. పాఠశాల విద్యార్థులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

**తే. 06-12-2024 ది :** ఈ రోజు స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కర్యాక్రమానికి కలెక్టరు అంబైద్కర్ గారు విభిన్న ప్రతిభవంతులు, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంటు డైరెక్టరు శ్రీ.వి.బి. జగదీష్ గారు మరియు ఇతర సంస్థల యాజమాన్యాల అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అందరూ హజరు అయినారు. ఇటీవల జరిగిన క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులను కలెక్టరు గారి ద్వార అందజేసారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ అధికారి జగదీష్ గారు మాట్లాడుతూ, దివ్యాంగులకు చేయుత అందించేందుకు అనేక మందికి బ్యాటరీ సైకిళ్ళు, ఇతర పరికరాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో డిజిటల్ రిహేబిలిటెషన్ సెంటర్ ఏర్పాటు చెశామని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. అందరికీ భోజన సదుపాయాన్ని స్థానిక ధనలక్ష్మీ జ్యూవెలర్స్ వారు అందించారు. తరువాత సాంసృతిక కర్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు.

**తే. 19-12-2024 ది :** ఈ రోజు పాఠశాలలో ఆడియో విజువల్ క్లాసు రూమ్ పారంభమైనది. ఈ రూమ్‌ని సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీ టి. అప్పారావు గారు, సంస్థ గౌరవ ఉపాధ్యక్షులు శ్రీ టి.వేంకటెశ్వర రావు గార్ల ద్వారా ప్రారంభమైనది. దీనికి గాను టి.వి మరియు ఫర్నిచర్‌ను లేటు సంక మృత్యుంజయ రావు గారి జ్ఞాపకార్ధం వారి మేనల్లుడు (యు.ఎస్.ఏ) వారు స్పాన్సర్ చెసారు.

**తే. 24-12-2024 ది :** ఈ రోజు పాఠశాలలో డా.సి.వి.రామన్ జన్మదినోత్సవం సందర్భంగా పాఠశాలలో గణిత ఉపకరణాలతో ఒక ప్రదర్శనను చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి బి.పి.ఎమ్. స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ బుచ్చిరాజు గారు, వారి స్కూల్ విద్యార్థులు పాఠశాలను సందర్శించారు.

# PHOTO CLIPPINGS



మన పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల
మరియు తల్లిదండ్రుల సమావేశం



మన పాఠశాలలో జరిగిన జాతీయ గణిత దినోత్సవ వేడుకలు



మన పాఠశాలలో నిర్వహించబడిన హెచ్.పి.వి.
వ్యాక్సినేషన్ కార్యక్రమం



మన పాఠశాలలో జరిగిన చిత్రలేఖన పోటీలలో
పాల్గొన్న మన విద్యార్థులు



అల్లూరి మూర్తి రాజు గారిచే మన పాఠశాల సందర్శన



స్థానిక శాసన సభ్యురాలు అదితి గజపతిరాజు గారి
జన్మదిన వేడుకలలో పాల్గొన్న మన విద్యార్థులు

# PHOTO CLIPPINGS



అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా
జరిగిన చదరంగ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



మన పాఠశాల ఆడియో విజువల్ రూమ్‌లో విద్యార్థుల
ఉపయోగార్థం అమర్చిన స్మార్ట్ టి.వి.




అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో
మన పాఠశాల విద్యార్థులు నాట్య ప్రదర్శన



పిక్‌నిక్‌లో పాల్గొన్న మన పాఠశాలల విద్యార్థులు

Donations are exempted from Income Tax Under
Section 12A and 80G of Income Tax Act of 1961 vide No.
**D.I. No. AADTS8354CF2021401.**
The Society is registered under Foreign Contribution
(Regulation) Act 1976 with Ministry of Home Affairs,
Government of India No. 010370024 dt. 19/09/1991

Please pass on this journal to your friends / relatives so as to create awareness of our programmes Articles & Experiences in the field of disabilities. Responses and your suggestions are solicited for publication in this Journal, please contact
**The Secretary**
Society for Education of the Deaf and Blind

If undelivered, please return to
society for Education of the Deaf and Blind (Regd.)
2-2-20, Perla Vari Street, Vizianagaram - 535001
Ph:(08922) 221061, 9392770832, E-Mail:sedbvzm@gmail.com

Designed, Edited & Published by
**Y. Vishnu,**
Hon. Founder Secretary and Correspondent
on behalf of Society for Education of the Deaf and Blind (Regd.)

Printed at S.E.D.B., VZM. Ph: 93927708932